# కల నిజమైతే?

అడల్ట్స్ ఓన్లీ కథ!

A



గదిలో ఒంటరిగా నిద్రపట్టక లేచి తలుపు గట్టిగా చప్పుడు చేసేలా బలంగా తీసి బయటకువచ్చాడు భార్గవ.

ఆ శబ్దం ద్వారా తన అసహనాన్నీ మనసులోని తీవ్రమైన కోరికనీ అసంతృప్తినీ అర్ధాంగికి తెలియజేయాలని అతని ప్రయత్నం. అప్పటికైనా ఆమె పడకగదికి వస్తుందేమో అని అతని ఆశ.

కాని అతని ఆశ నెరవేరలేదు. అర్ధాంగి రాధ రాలేదు. ఆమె మీద అతనికి చికాకేసింది. చిరుకోపమూ వచ్చింది.

ముప్పయి రోజులు ఏకబిగిన ఒంటరిగా పడుకోగలిగేందుకు తనేమీ ముసలివాడు కాదు. పెళ్లయి దాంపత్యసౌఖ్యాన్ని రుచి చూస్తున్నవాడు. నీతికల బ్రహ్మచర్యం ఎంత నీతివంతుడికైనా అగ్నిపరీక్షే. ఒక్క రోజు పనిమనిషి రాకపోతేనే ఇల్లు అస్తవ్యస్తమైపోతుందే, కట్టుకున్న ఆలి నెలకి నెలా నాగా పెట్టేస్తే ఆ నరుడేమైపోతాడూ? భార్యన్నాక ఆమాత్రం ఆలోచనుండొద్దూ.

వాకిట్లో వెన్నెల.

అలాంటిలాంటి వెన్నెల కాదు. అసలుసిసలైన పున్నమి వెన్నెల. పండువెన్నెల. పాల వెన్నెల. చిన్నవాళ్ళనూరించే చిలిపివెన్నెల. ముసలివాళ్ళలో కూడా మొహం రేకెత్తించగలిగే మనోహరమైన వెన్నెల. చందమామనీ ఆకాశాన్నీ చూస్తూ ఒంట్లోని తాపాన్నీ మనసులోని విరహాన్నీ మరచిపోవాలని వాకిట్లో కుర్చీ వేసుకుని కూర్చున్న భార్గవకి హఠాత్తుగా నిన్నరాత్రి వచ్చిన కల గుర్తుకొచ్చింది.

అతను తెగసిగ్గుపడిపోయాడు. చాలా బాధపడిపోయాడు. ఇంకెంతో పశ్చాత్తాపపడిపోయాడు.

ఆ కల రాధకి తెలిస్తే? ఎంత బాధపడుతుందో? ఎన్ని కన్నీళ్ళు కారుస్తుందో? కలలకి బుద్ధీ, జ్ఞానమూ ఉండవు. విచక్షణాజ్ఞానం ఉండదు. మంచీచెడూ అసలే ఉండవు.

రాత్రి కలలో..

తానుగదిలో ఉండగా-తలుపుమీద సున్నితంగా తట్టిన చప్పుడూ, సంగీతంలో గాజుల గలగలా...ఇంత కాలానికైనా ఈ పతి దీనుణ్ణి కరుణించి రాధ వచ్చిందని ఎంతో సంబరపడిపోతూ ఆరాటపడిపోతూ తలుపుతీసేసరికి రాధకాదు శ్యామల! తెల్లని పల్చని సిల్కుచీర..దానిలోంచి ఆమె సౌందర్యాలు తొంగి చూస్తూ, ఊరిస్తూ, చూపరులను ఊదరగొట్టేసేలా, ఉక్కిరిబిక్కిరి చేసేలా ఉందా లేదా అనిపించే ఆ చీరలో ఆమె ఊర్వశిలాగా ఉంది. పాతిక దాటిన ప్రౌఢ సౌందర్యమేమో మహా పసందుగా ఉందామె తనువు. ఒక చేత పాలగ్లాసు, మరొక చేత తాంబూల పళ్ళెం. ఆమెను అలా చూసేసరికి తనకి మతిపోయింది. కలో నిజమో అర్థంగాక వెర్రివాడిలా ఆమెనే చూస్తూ కరచరణాలాడక కట్టెలా ఉండిపోయాడు. కాని శ్యామల మాత్రం ఊరుకోలేదు. ముందడుగు వేసింది "తాళలేను నన్నందుకో తాత్సార మెందుకూ? తరిద్దాం బావా'' అంటూ తపన నాపుకోలేనట్టు తనని కౌగలించుకోబోతూంటే-

సరిగ్గా అదే క్షణంలో రసభంగం గావిస్తూ రాధ గొంతు. కల కరిగిపోయింది. తనకి మెలకువొచ్చేసింది. వొళ్లంతా చెమటలు పోసేసింది. సిగ్గుతో ఒళ్ళు చచ్చిపోయింది. పాపభీతితో గుండె మూలిగింది.

రాజ్

ఇక నిద్రపట్టలేదా రాత్రి.

అలాటి కల... తనలాటివాడికి రాకూడని కల... అలా ఎందుకొచ్చిందో ఊహించసాగాడు. విశ్లేషించసాగాడు, ఎలాగూ రెప్పపడడంలేదు కదా అని కూర్చుని.

రాధతో పెళ్లయి పన్నెండేళ్ళు. అంటే పన్నెండేళ్ళుగా ఒంటరి పడక మరచిపోయాడు ఎప్పుడో తప్పిస్తే. ఆ విషయం రాధకీ తెలుసు. రాధకి కూడా తను పక్కన లేకపోతే తనివితీరా నిద్రపట్టదన్న తియ్యని నిజం తనకి తెలుసు. నిజానికి రాధే కాని సవ్యంగా ఉంటే తనని రాత్రివేళ పూర్తిగా మరచిపోకపోతే తనకి చచ్చినా అలాంటి కల వచ్చి ఉండేది కాదు. కలలోకి వచ్చే స్త్రీ కూడా భార్య తప్ప అన్య కాంతలు కానంత ఏకపత్నీవ్రతుడే తను ప్రపంచం నమ్మినా మానినా. రాధే చాలు తనకీ జీవితమంతటికి. రాధే కాని తన గురించి కొంచెం పట్టించుకుని, కరుణిస్తుండి ఉంటే... ఆ కలా రాకపోవును, స్వప్నంలో అయినా తను పతనమూ కాకపోవును.

మూడునెలల కిందట శ్యామల భర్త ప్రమాదవశాత్తూ చనిపోయాడు. తనూ రాధా వెళ్లారు. అక్కడి వ్యవహారాలన్నీ పరిష్కరించుకుని ఆరు వారాల కిందట శ్యామల తమ ఇంటికి వచ్చింది రాధ తీసుకురాగా. ఆమె పరిస్థితి హృదయవిదారకమే, అత్యంత దయనీయమే. మహా అయితే ఆరేడేళ్ళు కాపురం చేసిందేమో ఆమె భర్తతో. అంతలోనే ఈ అవాంతరం. ఈ రాధక్కా... ఆ శ్యామలా... ఇద్దరే తల్లీ దండ్రీ లేరు.

''నిజానికి నేను శ్యామలకి అక్కని మాత్రమే కాదు అమ్మని కూడా. చిన్నప్పటినుంచీ దానినెంత అభిమానంగా ప్రేమగా పెంచానో, తల్లి లేదు కదా అని. నేను తప్ప ఇంకెవరున్నారని దానికి? నేనూ, నాతో పాటు మీరూ. అదింక ఇక్కడే ఉంటుందండి'' అని భోరున ఏడ్చింది రాధ ఆ వేళ.

''అది నువ్వు చెప్పాలా? నా అనుమతి కోరాలా? శ్యామల బాధ్యత నాదీను. ఆమె ఎవరని? నా మరదలే కదా'' అనేశాడు ఏమీ ఆలోచించకుండా. తనకేం తెలుసు. ముందున్నది ముసళ్ళ పండగనీ, రాధ తనకింత మొండి చెయ్యి చూపిస్తుందనీ? శ్యామల రావడమేమిటి, వాళ్లిద్దరూ ఒక గది, తనదొక్కడిదీ ఒక గది అయిపోయింది.

అహ.. రాధే అలా మార్చేసింది. ఇదెంతకాలంలే అనుకున్నాడు. భార్యాభర్తా ఏ గదిలో ఏకమయితే అదే పడకగదౌతుందిలే అని సరిపెట్టుకున్నాడు. శ్యామల నిద్రపోయాక తన గదిలోకి వచ్చి ఓ అర గంటైనా గడిపి వెళ్లదా అని ఆశించాడు. కానీ తన ఆశలన్నింటినీ అడియాసలే చేస్తూ వస్తోంది రాధ. ఆమె ఉద్దేశ్యమేమిటో అసలు? మామ్మగారి మోకాలుకీ, తాతగారి బోడిగుండుకీ ముడేసినట్టు శ్యామల వైధవ్యాన్నీ, తమ దాంపత్యాన్నీ ముడిపెడుతున్నట్లుందామె. అచ్చిపెళ్ళి బుచ్చి పీకలమీదకి వచ్చిందన్నట్టు చనిపోయిందేమో శ్యామల భర్తయితే, అసౌఖ్యమేమో తనదవుతోంది? వారమో పదిరోజులు అయితే అదో తీరు. అర్థం చేసుకోనూ వచ్చు. సహకరించనూ వచ్చు. కాని ఇలా నెలల తరబడి కట్టుకున్నవాడిని సంసార సౌఖ్యం నుంచి దూరం చేయడం ఏ భార్యకైనా భావ్యమేనా? లోకం మాత్రం హర్షిస్తుందా? ఎంత సొంత చెల్లెలి వైధవ్యం పట్ల సానుభూతి అయినా కన్నుపోయేంత కాటుకలా మరీ ఇంత చేటా? స్వంతకాపురం మానేసుకుంటారా? పోయినవాళ్లతో పోలేరు, అలాగే ఎవరి కర్మ వారిది. తనువులో తనువుగా, మనసులో మనసుగా ఇన్నేళ్ళనించి కలసి కాపురం చేస్తున్నామే? తననింత నిర్లక్ష్యం ఎలా చేయగలుగుతోంది రాధ? శ్యామల ధ్యాసే తప్ప నా యావ అసలు పట్టించుకోదేం?

తన ఒంటరి నిద్ర అనే శాపానికి ఇప్పటికైనా ముక్తీ మోక్షమూ ప్రసాదించదలుచుకుందా లేదా?

ఎలా చెప్పాలామెకు? ఆమె శ్యామలకు అక్క మాత్రమే కాక నాకు భార్య కూడా అని? వారానికి రెండు మూడు రాత్రులైనా జంట పడక హాయి లభించకపోతే నాకు వొళ్ళు సలపరమెత్తుతుందనీ. సిగ్గువిడచి చెప్పుకునేందుకు సిద్ధపడినా ఆమె ఒక్కసారైనా ఏకాంతపు అవకాశం ఇస్తే కదా? నన్ను చూస్తూనే తప్పించుకుపోతుందాయె.

రాధ నా ప్రాణం. ఆమెకు మాత్రం అప్పుడప్పుడేనా నా తియ్యని అవసరం తీర్చుతూండవలసిన ధర్మం, బాధ్యతా లేవూ అర్ధాంగిగా!

ఒకటి రెండుసార్లు శ్యామల బాత్‌రూంలోంచి టవల్ మాత్రమే చుట్టుకుని వస్తూ, స్నానానికి అర్ధనగ్నంగా తయారై వెళ్తూ కనిపించింది. వద్దు, కూడదనుకున్నా కంటపడిన ఆ దృశ్యాలు. ఆపైన నెలల తరబడి శృంగారోపవాసాలు. అందుకే కదా తనలాంటి మంచివాడికి కూడా అలాటి అసభ్యమైన కల వచ్చింది? ఆలోచించి ఆలోచించి.

వెన్నెల కూడా విసుగొచ్చి భరించలేక తన గదిలోకి వచ్చాడు భార్గవ. అతనికి భయంగా ఉంది. ఇంకొన్నాళ్ళు ఇలాగే రాధ ఎండగట్టేస్తే, ఉద్రేకంలో తను... ఆ ఆలోచనకే అతను వొణికిపోయాడు. వొద్దు... పరువు... ఆరోగ్యం... ధనం... అన్నీ నష్టమే. ఎంత ఆకలి మీదున్నా ఎంగిలి కూడు తినడమా? ఛీ... మెల్లగా తలుపుతీసిన చప్పుడు.

అసంకల్పితంగానే అటు చూశాడు.



## నేను నేనే!

**ఆనందం, ఒకటో నెంబర్ కుర్రాడు చిత్రాల్లో నటించిన బక్కపల్చ భామ రేఖ స్వతహాగా కన్నడ అమ్మాయే అయినా తెలుగులో నటించడం అంటే భలే ఇంట్రెస్టు అంటుంది. మీ ముఖకవళికల్లో కాస్త ఐశ్వర్యారాయ్ పోలికలున్నాయి కదా అని అంటే- ఈ మాట చాలా మంది నాతో అంటూంటారు. ఐశ్వర్య లాంటి అందగత్తెతో నన్ను పోల్చడం నిజంగా నా అదృష్టం. కానీ నేను నేనుగానే గుర్తింపబడాలనుకుంటాను. అందుకు తగిన కృషి చేస్తాను- అని చెబుతోంది రేఖ.**

త్రుళ్ళిపడ్డాడు. వాస్తవమో, భ్రమో అర్థంగాక కంగారుపడిపోయాడు. ఆమె తల వొంచుకుని ద్వారం వద్దే నిలబడినా, బెడ్‌లైట్ కాంతి ప్రకాశవంతంగా లేకపోయినా స్పష్టంగానే కనబడుతూంది సందేహానికి తావివ్వకుండా.

తెల్లచీర, తలలో పూలు, చేతులకి గాజులు, నుదుటబొట్టు, మెడలో గొలుసు... అనకూడదు కానీ అందమైన అభిసారికలాగే ఉంది.

''ఏమిటిది శ్యామల? ఎందుకొచ్చావ్?'' అతని కంఠం వొణికింది. ఆమె ఏమీ అనకుండా మౌనంగా ఉండిపోయింది.

''శ్యామలా! నన్ను నమ్ము. నీ మీద నాకలాంటి ఉద్దేశంకానీ కోరికగానీ ఏమీలేదు. ఒట్టు నేను నిజంగా ఏకపత్నీవ్రతుడ్నే. నాకు మీ అక్కంటే ఎంత ప్రేమో తెలుసా? నా అర్ధాంగికి మనసా, వాచా, కర్మణా త్రికరణశుద్ధిగా అనురాగబద్ధుడినై ఉండడమే తప్ప ఎంతమాత్రమూ అన్యాయం చెయ్యలేను, చెయ్యను. మీ అక్కయ్య చూస్తే ఎంత బాధపడుతుందో?''

సరిగ్గా అప్పుడే ఆ గదిలోకి రాధ వచ్చేసింది. దానితో భార్గవ పరిస్థితి మరీ దయనీయమైపోయింది. అతని భయం మరీ ఎక్కువైపోయింది. ఇలాంటి పరిస్థితిలో తననీ, శ్యామలనీ చూసి రాధ ఏమనుకుంటుందో?

''నాకు తెలుసండీ మీరెలాంటివారో. మీ మాటలకి నా కడుపు నిండిపోయిందంటే నమ్మండి. నిజంగా నా అంత అదృష్టవంతులెవరూ ఉండరేమో. పరస్త్రీ దొరుకుతుందా ఓసారి ట్రై చేసి చూసేద్దాం అని వెంపర్లాడే మగవాళ్ళే ఎక్కువ ఈరోజుల్లో. మీరు మాత్రం అవకాశం ఇచ్చినా మడిగా ఉన్నారు. మీరు నిజంగా పుణ్యపురుషులు. నేను ధన్యజీవిని''

భార్గవకి అనుమానం వచ్చింది. కొన్ని సగటు కథలలోగా రాధ తన శీలం మీద పందెం వెయ్యలేదుకదా శ్యామలతో?

''మీరొక్కసారి ఇవతలకి రండి నాతో. మీతో కొంచెం మాట్లాడాలి'' అంటూ ఆమె అతని చేయి పట్టుకుని వరండాలోకి తీసుకొచ్చి కూర్చోబెట్టింది.

''మీరు మంచివారు. మనసున్నవారు. అర్థం చేసుకోగలరు. అందుచేతనే ధైర్యం చేసి నా మనసులో మాటలు చెప్పుకోవాలనుకుంటున్నాను''

భార్గవకి తన భార్య కొత్తగా కనిపించింది. విచిత్రంగా అనిపించిందామె వైఖరి.

''మీకు తెలుసు. శ్యామలకి నేనూ, నాకు శ్యామలా. అంతే అని. పుడుతూనే తల్లిని కోల్పోయిన శ్యామలంటే నాకెంతో ప్రేమ. దానికి పెట్టనిదే నేనేమీ తినేదాన్ని కాను. నాకుండేదేదైనా సరే దానికి ఉండి తీరవలసిందే. దాని కర్మకొద్దీ ప్రమాదంలో భర్త చనిపోయాడు''

''మళ్లీ పెళ్ళి చేద్దాం. శ్యామలకేమంత వయసని?''


''ఇన్నాళ్లనుంచీ నేను దానిముందు మొత్తుకుంటున్నదీ అదే. కాని వినదే. ఈ విషయంలో దాని మనసు మార్చడం ఆ బ్రహ్మతరం కూడా కాదని చెప్పగలను''

''మీరు నన్ను వెర్రిదాన్ననుకోండి పిచ్చిదాన్ననుకోండి. మరేమన్నా అనుకోండి. నేను మనసు విప్పి చెప్పేస్తున్నాను. నా ప్రాణంలో ప్రాణం అయిన చెల్లెలు, ఏ సుఖానికీ నోచుకోకుండా. నాకంటే చిన్నది నా కళ్ల ముందు మోడులా తిరుగుతూంటే నేనెలా భరించగలను? మీతో నేనెలా సుఖపడగలను? నేను మనిషినే కదా!'' రాధ కంఠంలో దుఃఖం.

''అంటే... శ్యామల ఎన్నటికీ పెళ్ళి చేసుకోదు కనుక నువ్వు ఇక ఎన్నటికీ మన పడకగదిలోకి రావా? ఇదెక్కడి చోద్యం రాధా? నీ చెల్లెలి మీద నీకెంతైనా ప్రేమ ఉండొచ్చుగానీ భర్తను కలిగి ఉన్న నువ్వు కూడా నీ సుఖాన్ని త్యాగం చేయడం నేను మాత్రం చచ్చినా హర్షించను. నీ చెల్లెలి కోసం నువ్వు సంసారసౌఖ్యాన్ని త్యజించగలవేమో కాని మరదలి కోసం నేను స్త్రీ సౌఖ్యాన్ని మాత్రం శాశ్వతంగా వొదులుకోను. వొదులుకోలేను. నేను మనిషినీ మగవాడినీ రాధా. నీకేమాత్రం ఆలోచనా ఉన్నా నీ మాటలిలా ఉండేవి కావు. నీ ఊహలు ఎంత అన్యాయంగా, దారుణంగా, అసంబద్ధంగా ఉన్నాయో నీకు తెలుస్తున్నట్లు లేదు'' మందలిస్తున్నట్టుగా అన్నాడు భార్గవ..

''అయ్యో! మీ సంగతి మరచిపోతానా? మీరు నా దేవుడే కదండీ. అందుకే కదా శ్యామలనొప్పించాను. బతిమాలీ బామాలీ కాళ్లావేళ్ళాపడీ?''

అతను త్రుళ్ళిపడ్డాడు. ''మనం సంసారం చేసుకునేందుకు శ్యామలనొప్పించడం ఎందుకూ?'' అడిగాడు వెర్రిమొహం వేసి.




''మానవతాదృక్పథమండీ, మానవతాదృక్పథం. కరుణ, జాలి, ప్రేమ.. అన్నీననుకోండి. శ్యామలకి లేని సుఖం నేను పొందలేను. అది నా బలహీనతే అనుకోండి''

'గొప్ప బలహీనతే!' మనసులో పళ్ళు పటపట కొరుక్కున్నాడు.

''అందుకని మన ముగ్గురికీ అనుకూలంగా ఉండేలా ఒక పద్ధతి ఆలోచించాను. దాని వలన ఎవరికీ కష్టం ఉండదు. మీరు కూడా ఊఁ అంటే...''

అతనికేమీ అర్థం కాలేదు. ''దేనికి నేను ఊఁ అనాలి?''

''అప్పుడప్పుడు శ్యామల కూడా మీ పడకగదిలోకి వస్తూంటుంది. మీరు కాదనకూడదు'' భయపడుతున్నట్లే, బెదురుతున్నట్లే తడబడుతూనే అంది.

''రాధా'' అరిచాడు భార్గవ. తనలోని భావాలను నిగ్రహించుకోలేక, ''నీకు వెర్రా, పిచ్చా?''

''ఎందుకూ అంత కంగారుపడతారు? చెల్లెలి పట్ల నా ప్రేమా, ఆపేక్షా మీ కంటికి వెర్రిగా అనిపిస్తే నన్ను పిచ్చిదాన్ననే అనుకోండి'' రాధ కళ్లల్లో నీళ్ళు.

''నిన్నేమనుకోవాలో తెలియడం లేదు, భర్తనే పంచే భారత స్త్రీ! ఇది నిజమేనా'' నమ్మలేనట్లుగా గొణిగాడు.

అదే క్షణంలో ఆ గదిలోకి వచ్చింది శ్యామల. ఆమెను చూస్తూ ''మీ అక్కయ్య పిచ్చి ప్రతిపాదనకు నువ్వంగీకరించావా?'' అసహ్యించుకుంటున్నట్లే అన్నాడు.

''లేదు బావా. నేనెంత చెప్పినా అక్కయ్య వినలేదు. నేను వారినెంత ప్రేమించానంటే వారితోనే నా కోరికలూ, జీవితమూ శూన్యమైపోయాయి. నీముందిలా నిలుచోవలసి వచ్చినందుకు సిగ్గుతో చితికిపోతున్నాను. మీ ఇద్దరికీ నేనొక్కటే విన్నవించుకోదలుచుకున్నాను. ఆశ్రయమిచ్చారు చాలు. నాకోసం మీరింక త్యాగాలు చేయొద్దు. అక్కయ్య తలపెట్టిన పిచ్చి త్యాగాన్ని నేనెంతమాత్రం భరించలేను'' ఏడ్చేసింది శ్యామల.

మెల్లగా అన్నాడు భార్గవ. ''రాధా! నీ అమాయకత్వానికైనా హద్దుండాలి. మగవాళ్లలో కూడా శీలవంతులూ, ఏకపత్నీవ్రతులూ ఉండొచ్చని నీకెందుకు తట్టలేదో? నువ్వు నన్ను నీ చెల్లెలితో పంచుకునేందుకు సిద్ధపడినా, నేను నా శీలాన్ని ఏకపత్నీవ్రతాన్నీ వొదులుకునేందుకు సిద్ధంగా లేను'' చివరి మాటలనేటప్పుడు అతని కంఠం చాలా కఠినంగా మారిపోయింది.

రాధ నిశ్చేష్టురాలై మిగిలిపోగా-శ్యామల అప్పటికే ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. ☆